క్లుప్తంగా

ఘనంగా వేపారమ్మ జాతర



శంఖవరంలో వేపారమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శంఖవరం: కోరిన కోర్కెలు తీర్చే శంఖవరం గ్రామ దేవత వేపారమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం వద్ద భజనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

వైభవంగా మరిడమ్మ తీర్థం



ఏలేశ్వరంలో మరిడమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే మరిడమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద కొలువైన అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీర్థంలో సందడి చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


నిత్యావసరాల ధరలు తగ్గించాలంటూ నిరసన



రంపయర్రంపాలెంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతుకూలీ సంఘం సభ్యులు

గోకవరం: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రంపయర్రంపాలెం గ్రామంలో రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో రోజురోజుకూ నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగి సామాన్యులపై పెనుభారం పడుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిత్యావసరాలు, కూరగాయల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్, పీడీఎస్‌యూ కార్యదర్శి పి.శ్రీకాంత్, గోలి మునలయ్య, వడ్లపాటి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వు సాగు



దొండవాకలో ఆశాజనకంగా ఉన్న నువ్వు చేను

తుని రూరల్: మండలంలో నువ్వు చేలు పిందె, కాయదశల్లో ఆశాజనకంగా ఉన్నాయి. వేసవిలో ఆరుతడి పంటగా రైతులు నువ్వు పంట సాగు చేశారు. దొండవాక, కేఓ.మల్లవరం, బీఎస్ పేట, డి.పోలవరం, ఎస్‌బీ.పేట, కొలిమేరు, కుమ్మరిలోవ, రాపాక, రాజుపేట, లోవకొత్తూరు, వి.కొత్తూరు, ఎస్.సూరవరం, ఎస్ఎస్‌వీ నగరం తదితర గ్రామాల్లో 80 ఎకరాల్లో రైతులు నువ్వు పంటను సాగు చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈనెలాఖరుకు పంట కోతలు ప్రారంభమవుతాయన్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన చోట ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి లభించే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

కిర్లంపూడి: మండలంలోని ముక్కొల్లులో ఉజ్వల ఉచిత గ్యాస్ పథకం ద్వారా లబ్ధిదారులకు మంజూరైన గ్యాస్ కనెక్షన్లను ఆదివారం పంపిణీ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు యడలి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు, జగ్గంపేట ఇన్‌చార్జ్ కామినేని జయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని 35 మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు దొడ్డ అప్పారావు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సదా మీ సేవలో..



గోపాలపట్నంలో ట్రై సైకిల్‌పై తిరుగుతూ సేవలందిస్తున్న గ్రామ వలంటీర్ రాజాబాబు



గోపాలపట్నంలో వృద్ధురాలు మార్తమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న రాజాబాబు

- గ్రామ వలంటీర్‌గా సేవలందిస్తున్న దివ్యాంగుడు రాజాబాబు
- ట్రై సైకిల్‌పై తిరుగుతూ సకాలంలో పింఛన్ల పంపిణీ

తొండంగి: అంగవైకల్యంతో నిరుద్యోగిగా ఇబ్బంది పడుతున్న తనకు గ్రామ వలంటీర్‌గా అవకాశం రావడంతో ప్రజలకు సేవ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు.. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా తొండంగి మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన మారేడుపూడి రాజాబాబు పుట్టుకతోనే దివ్యాంగుడు. ఇంటర్ వరకూ చదువుకున్న రాజాబాబు నిరుద్యోగిగా ఉండేవాడు. అన్న అప్పలరాజు, అక్క శ్రీలక్ష్మికి వివాహాలు కావడంతో రాజాబాబు తల్లిదండ్రులైన అర్జమ్మ, నూకరాజు వద్దే ఉంటున్నాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ వలంటీర్‌గా చేరి గ్రామంలో తనకు కేటాయించిన 50 ఇళ్లకు దివ్యాంగుడైనప్పటికీ మూడు చక్రాల సైకిల్‌పై తిరిగి పింఛన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నాడు. దివ్యాంగ పింఛన్ రూ.3వేలతో పాటు వలంటీర్‌గా గౌరవ వేతనం రూ.5 వేలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం మిస్సమ్మను వివాహం చేసుకున్నాడు. జగనన్న ప్రభుత్వంలో తనకు వచ్చే కొద్దిపాటి ఆదాయం తన కుటుంబ పోషణకు సరిపోతుందని రాజబాబు తెలిపాడు.

కొడుకులా వచ్చి పింఛన్ అందిస్తాడు

మా గ్రామ వలంటీర్ రాజాబాబు దివ్యాంగుడైనప్పటికీ మూడు చక్రాల సైకిల్‌పై తిరుగుతూ ఇంటికి వచ్చి పెద్ద కొడుకులా వితంతు పింఛన్ సొమ్ము ప్రతినెలా 1వ తారీకునే అందిస్తాడు. అతని సేవలు మరువలేం.

– శివకోటి రాఘవమ్మ, గ్రామస్తురాలు, గోపాలపట్నం, తొండంగి మండలం

వైకల్యాన్ని లెక్క చేయకుండా సేవలు

వృద్ధురాలినైన నాకు మా గ్రామ వలంటీర్ రాజాబాబు మూడు చక్రాల సైకిల్‌పై వచ్చి వృద్ధాప్య పింఛన్ డబ్బులు అందిస్తాడు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల కోసం అవగాహన కల్పిస్తాడు. వైకల్యం ఉన్నా లెక్క చేయకుండా సైకిల్‌పై తిరుగుతూ సేవలందించడం గొప్ప విషయం. అతని సేవలు అందరికీ ఆదర్శం.

– యగ్గాడ మార్తమ్మ, వృద్ధురాలు, గోపాలపట్నం, తొండంగి మండలం

వలంటీర్ సేవలు అభినందనీయం



వైఎస్సార్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నుంచి నాకు పింఛను వస్తోంది. మహానేత అనంతరం వచ్చిన ప్రభుత్వాల్లో రోజుల తరబడి పింఛన్ సొమ్ముల కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. గత నాలుగేళ్లుగా పరిస్థితి మారింది. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థతో మా కష్టాలు తీరాయి. ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే మా వలంటీర్ రవళి తలుపు తట్టి పింఛన్ అందజేస్తోంది. ప్రభుత్వ పథకాలపై మాకు అవగాహన కల్పిస్తోంది. వలంటీర్ల సేవలు అభినందనీయం.

– మలిచెట్ల రాఘవ, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం



ఆపదలో కొండంత అండ



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బంగారమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆశాజ్యోతి

మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన వడ్డి బంగారమ్మ క్యాన్సర్‌తో బాధపడుతూ కొన్ని నెలల పాటు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీంతో ఆమె పింఛను సొమ్ములు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో గ్రామ వలంటీర్ అరిగెల ఆశాజ్యోతి వ్యయ, ప్రయాసలకు ఓర్చి చింతలూరు నుంచి కాకినాడ 50 కిలో మీటర్లు వెళ్లి ఆమెకు పింఛను సొమ్ములు అందజేసింది. బంగారమ్మ జీజీహెచ్‌లో చికిత్స పొందిన నాలుగు నెలల పాటు క్రమం తప్పకుండా వలంటీర్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ములు అందజేశారు. అనంతరం బంగారమ్మ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృతి చెందారు. కష్టకాలంలో బంగారమ్మకు కొండంత అండగా నిలిచిన గ్రామ వలంటీర్ ఆశాజ్యోతి సేవలను కుటుంబ సభ్యులతో పాటు అధికారులు, స్థానిక నాయకులు అభినందించారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో పేదల సాగు చేసుకుంటున్న భూమి విషయంలో అధికారుల తీరుకు నిరసనగా సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుర్రంపాలెంలో పేదలు సాగు చేసుకుంటున్న భూమి పరిశీలనకు పెద్దాపురం ఆర్డీఓ వస్తారని చెప్పి నెలరోజులు గడుస్తున్నా రాలేదన్నారు. అధికారుల తీరుకు నిరసనగా కలెక్టరేట్‌ను ముట్టడించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో సంఘం సహాయ కార్యదర్శి కె.సతీష్, డివిజన్ నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ లోపం...రైతులకు శాపం

- నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయిన తిమ్మరాజుచెరువు కాలువ
- తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఆయకట్టుకు అందని సాగునీరు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



పంటకాలువలో పేరుకుపోయిన చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు



పూడుకుపోయిన పంటకాలువ

ఏలేశ్వరం: అధికారుల సమన్వయ లోపం రైతులకు శాపంగా మారింది. రెండు ప్రభుత్వ శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలయాపన చేయడంతో తమ పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టణ పరిధిలోని తిమ్మరాజుచెరువు ప్రధాన పంటకాలువ నుంచి ఏటా వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇటీవల పట్టణంలో ఆక్రమణల పేరుతో పంటకాలువను ఆనుకుని ఉన్న దుకాణాలను నగర పంచాయతీ అధికారులు కూల్చివేశారు. కూల్చివేసిన శిథిలాలు పంటకాలువలో ఉండిపోయాయి. దీంతో కాలువ పూడుకుపోయి దిగువన ఉన్న ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి నెలకొంది. నగర పంచాయతీ అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారం దుకాణాలు కూల్చివేశారని బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దుకాణదారులు కోర్టును ఆశ్రయించడంతో శిథిలాలు తొలగింపునకు ఆటంకం కలిగిందని నగర పంచాయతీ అధికారులు అంటుండగా శిథిలాలను వారే తొలగించాలని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇలా రెండుశాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణల వరకూ మాత్రమే కోర్టు స్టే ఇచ్చిందని, పంటకాలువకు సంబంధం లేదని స్థానిక రైతులు చెబుతున్నారు.

ఆక్రమణలు తొలగించి నెలలు గడుస్తున్నా..

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. ఆక్రమణలు తొలగించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కాలువలో శిథిలాలు తొలగించకపోవడంతో సాగుకు నీరు అందక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాలువలో వ్యర్థాలు తొలగించి తమ పొలాలకు నీరు అందించాలని ఇప్పటికే రైతులు ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ పంట కాలువలో భవన నిర్మాణ వ్యర్థాలు వేసింది నగర పంచాయతీ అధికారులేనని, వాటిని తొలగించాల్సిన బాధ్యత కూడా వారిదేనని సమాధానమిచ్చారు. ఈ మేరకు కాలువలో వ్యర్థాలు తొలగించాలని నగర పంచాయతీ అధికారులను రైతులు కోరగా అది కోర్టు పరిధిలో ఉందన్నారు. జేసీబీ, ట్రాక్టర్లు సమకూరుస్తామని రైతులే తొలగించుకోవాలని బాధ్యతారహితంగా బదులిచ్చారు. ఇరుశాఖల అధికారులు తప్పించుకొనే ధోరణి అవలంబించడంతో రైతులు అయోమయంలో పడ్డారు. దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నెల రోజులుగా తిరుగుతున్నాం



మా పొలాలకు సాగునీరు అందించాలని గత నెల రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పటివరకూ ఇరుశాఖల అధికారులు సాగునీరు అందించేందుకు ఎటువంటి హామీ ఇవ్వలేదు. సాగు చేపట్టాలో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

– సామంతుల కృష్ణ కిషోర్, రైతు, ఏలేశ్వరం

సాగునీరు అందించాలి



తిమ్మరాజుచెరువు ఆయకట్టుకు సాగునీరు అందించాలి. కాలువలోని వ్యర్థాలు తొలగించి సాగునీరు సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఖరీఫ్‌కు సమయం దాటిపోతోంది. అధికారులు దీనిపై సకాలంలో చర్యలు తీసుకోవాలి.

– సతివాడ సత్యనారాయణ, రైతుఏలేశ్వరం

25న ఆలయ భూములకు కౌలు వేలం

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి శివాలయానికి చెందిన భూములకు ఈ నెల 25న కౌలు వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త, ప్రధానార్చకుడు శంకరణం గోవిందరావు ఆదివారం తెలిపారు. గ్రామంలోని 861, 865 సర్వే నంబర్లలో ఆలయానికి గల 21.50 ఎకరాల మెరక, 4.23 ఎకరాల పల్లం భూములకు 2023 నుంచి 2026 వరకూ మూడేళ్ల కాలపరిమితికి కౌలు వేలం నిర్వహిస్తామన్నారు. ప్రథమ ధరావత్తుగా రూ.50 వేలు, రూ.10 వేలు నిర్ణయించామన్నారు. ఆసక్తి గల పాటదారులు స్వాల్వెన్సీతో పాటు నిబంధనలకు అనుగుణంగా ధరావత్తు చెల్లించి వేలం











పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

అన్నవరం: స్థానిక సత్యదేవ సంస్కృతోన్నత పాఠశాలకు చెందిన 1973–74 బ్యాచ్ పదో విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 50 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకుని మురిసిపోయారు. అప్పటికి, ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చినా తమ స్నేహంలో మాత్రం ఏ మార్పు లేదని ఉబ్బితబ్బిబయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు పీఎస్ఎన్ మాష్టారు, సీహెచ్ అప్పారావులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ సూరా ప్రసాద్, విశ్రాంత కల్యాణబ్రహ్మ ముత్య సత్యనారాయణ, రాయప్రోలు కామేశ్వర శర్మ, యాళ్ల సత్యవతి, దూర్వాసుల రమామణి, లీలా కుమారి, శెట్టిబత్తుల మేరీ, పసుపులేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎస్ఈబీ దాడులు



సారా కేసులో పట్టుబడిన నిందితులతో ఎస్ఈబీ సిబ్బంది

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెంలో సారా బట్టీలపై ఆదివారం ఎస్ఈబీ సిబ్బంది దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణునిపాలెం గ్రామ శివారున సారా తయారు చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు కోరుకొండ ఎస్ఈబీ ఎస్సై సత్యనారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో రెండు బైక్‌లు, 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రంపయర్రంపాలేనికి చెందిన గందం మరిదయ్య, గందం అర్జు, కేతా ఈశ్వరరావు, ఓరుగల్ల సూర్యచంద్రంలను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై సత్యానారాయణ వివరించారు.

రహదారి చెంతనే వ్యర్థాలు



ఏలేశ్వరం కప్పలచెరువు సమీపంలో రహదారి చెంతనే పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం: పట్టణంలోని కప్పల చెరువు సమీపంలోని ప్రధాన రహదారి చెంతనే చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. కొందరు రహదారి చెంతనే చెత్త వేయడంతో పాటు బహిర్భూమిగా ఉపయోగిస్తున్నారు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లడంతో ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా తిరుమాలి వెళ్లేందుకు మార్గంతో పాటు వందలాది ఎకరాల సాగుభూమి ఉంది. దీనికి సమీపంలోనే జగనన్నకాలనీ ఉంది. కాలనీకి వెళ్లే ప్రజలు, రైతులు రహదారి మీదుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చేసిన సేవలే చిరస్థాయిగా మిగిలేవి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కాకినాడ ఎంపీ గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమాజంలో చేసిన సేవలే మనం ఉన్నా లేకపోయినా చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యభాస్కర ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ నామమాత్రపు రుసుమతో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే ఈ ల్యాబ్ సేవలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల మాట్లాడుతూ నేటి కాలంలో ఇటువంటి ల్యాబ్‌లు సమాజానికి అవసరం అన్నారు. ల్యాబ్ ట్రస్టీ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ పలివెల సత్యరాజు ట్రస్ట్ రూ.2 కోట్ల విలువైన స్థలం ఉచితంగా ఇవ్వగా, దాతల సహకారంతో ల్యాబ్ పరికరాలు, బిల్డింగ్ నిర్మాణం నిమిత్తం మరో రూ.2.5 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ ఐవీ రావు, సీపోర్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

తొండంగి: మండలంలోని నర్సిపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ ఈ శిబిరం ఏర్పాటు చేశారు. కాకినాడకు చెందిన వైద్యులు దానవాయిపేట, నర్సిపేట, ఒంటిమామిడి, కొత్తపాకలు, తాటియాకుల పాలెం తదితర గ్రామాలకు చెందిన 250 మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

● తీరంలో పర్యాటకుల సందడి



కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర తీరానికి చేరుకుని కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రామలింగేశ్వరరావు సహా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానము, దేవదాయ-ధర్మదాయశాఖ

ఒంటిమామిడి

[illegible]

క్ర.సం.	సర్వే నెం.	విస్తీర్ణం	ప్రథమ ధరావత్తు	రిమార్కులు
1	861	ఎ. 21-50 సెంట్లు	రూ.50,000/-	మెరక
2	865	ఎ. 4-23 సెంట్లు	రూ.10,000/-	పల్లం

[illegible]

సెల్: 9704107882 — ఎస్.గోవిందరావు, అర్చక మరియు పెర్మె ధర్మకర్త